క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల గొప్పమనసు



ప్రకాశరావు కుటుంబానికి నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పరవాడ: కలపాక శివారు పెదస్వయం భూవరం గ్రామానికి చెందిన ఇందల ప్రకాశ రావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధప డుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న 1992 –93లో ప్రకాశరావుతో కలిసి పదో తరగతి చదువుకున్న వారు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.32 వేలు ఆదివారం అందజేశారు. కార్యక్ర మంలో పూర్వ విద్యార్థులు వెన్నల సన్యాసి రావు, ఎస్.వెంకునాయుడు, జి.ఎస్.నాయు డు, గండి లోకేష్, ఎం.ఆనంద్, ఎం.రాజు, బోండా భరత్, ఏడు కొండలు, జి.ఎల్. నారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: పద్మనాభపురం సబ్‌స్టేషన్ బంటా కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీ ఎల్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. బంటాకాలనీ, మేహాద్రిగెడ్డ కాలనీ, అప్పలన ర్సయ్యకాలనీ, వెంకటసాయినగర్, రవినగర్ ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

దొరగూడలో హిందూ ధర్మ ప్రచారం



గిరిజనులకు అప్పన్న చిత్రపటాలు అందజేస్తున్న సురేంద్రస్వామి

సింహాచలం: అల్లూరి జిల్లా అరకు మండలం లోని దొరగూడ గ్రామంలో ఆదివారం సింహాచ లంలోని శ్రీ సింహాద్రి మఠం ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. సింహాద్రి మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి 80 మంది గిరిజనులకు వరాహ లక్ష్మీనృసింహస్వామి చిత్రపటాలు అందజేశారు. హిందూ ధర్మం విశిష్టతను తెలియజేశారు. శ్రీ నృసింహ దీక్షల గురించి అవగాహన కల్పించారు. ఈనెల 20న జరిగే గిరిప్రదక్షిణలో పాల్గొనాలని గిరిజనులను కోరారు.

అమ్మవారి ఆలయంలో మొక్కలు నాటిన భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని అగనంపూడికి చెందిన శ్రీబొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో బొర్రమాంబ ఆలయంలో మొక్కలు నాటారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మొదటి వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరసారెలు సమర్పించి దీపధూపనైవేద్యాలు సమర్పించారు. తరువాత లలిత, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా లలిత, విష్ణు సహస్ర నామపారాయణం, భగవద్గీత పారాయణ గురుజీ రాణి, సాయిరామ్ మాతలను సత్కరించారు. తరువాత నూకాంబికా ఆలయం, పిల్లిల నాగమ్మ, పోలిపల్లి అమ్మవారు, స్వయంభు దేవాలయం, కోదండరామ ఆలయం, పరదేశమ్మ ఆలయం, దుర్గాలమ్మ తల్లి ఆలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ కమిటీల చైర్మన్ చిత్తా గణేష్, రామారావు, పారాయణ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

అయ్యో.. అభాగ్యులు

ఒకరు తమలో తామే ఏదో మాట్లాడుకుంటూ ఉంటారు. అంతలోనే నవ్వుతుంటారు. ఏడుస్తూ సైగలు చేస్తారు. ఎవరినో శపిస్తూ.. అర్థం పర్థం లేని భాష మాట్లాడుతుంటారు. మరొకరు మాటా పలుకూ లేకుండా రోడ్డు పక్క రాయిలా పడి ఉంటారు. కొందరు జనం మీద దాడులు చేస్తారు. వీరంతా దీనులు.. దురదృష్టవంతులు. ఎక్కడ పడితే అక్కడ కనిపించే వీరంతా మనసు చెదిరిన అభాగ్యులు. సమాజంతో బంధం తెగిపోయి.. తెగిన గాలిపటాల్లా గాలివాటున కొట్టుకుపోయే సమాజం విసిరేసిన దీనులు. గాలికి ఎగిరే కాగితం ముక్కలా ఎక్కడో మొదలై.. మరెక్కడో కథ ముగిసిపోయే నిర్భాగ్యులు.

- అయిన వాళ్లకు దూరంగా రోడ్డు పక్క బతుకుతున్న దురదృష్టవంతులు
- పిచ్చివాళ్లు అనే కారణంగా కరుణ చూపని సమాజం



జ్ఞానాపురం రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం వద్ద..

దాబాగార్డెన్స్: ఎక్కడ పుట్టారో, ఎక్కడ పెరిగారో తెలియదు. ఇక్కడికి ఎలా వచ్చారో అంతకన్నా తెలియదు. ఇక్కడ ఎన్నాళ్లుంటారో.. మళ్లీ ఎక్కడికి వెళ్తారో.. అసలు ఎక్కడికైనా వెళ్తారో లేదో కూడా అర్థం కాదు.. సమాజం అంటే పట్టని ఈ నిర్భాగ్యుల జీవితమనే పుస్తకంలో పేజీలు తారుమారై.. అక్షరాలు చెల్లాచెదురై.. మనసు ఆన వాళ్లు మాయమైపోయిన అభాగ్యులు.. వారే ఎక్కడ పడితే అక్కడ తారస పడే పిచ్చివాళ్లు. దేనిపైనా ధ్యాస లేక..తమకేమవుతుందో తెలియక.. ఇది తమ తనువనే స్పృహ కూడా కాన రాక వింతగా, విభిన్నంగా ప్రవర్తిస్తూ సమాజానికి దూరమైపోయిన దీనులు వీళ్లు.

ఎక్కడైనా కనిపిస్తారు..

ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వాళ్లు నగరంలో అనేక చోట్ల కనిపిస్తారు. బస్టాపులు, రైల్వేస్టేషన్ పరిసరాలు, మారుమూల ప్రాంతాలు, ఫుట్‌పాత్‌లు.. ఎక్కడైనా వీళ్లు కనిపిస్తారు. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాల నుంచి విశాఖకు వచ్చే రైళ్లలో పిచ్చివాళ్లు వస్తున్నారు. నగరంలోని రైల్వేస్టేషన్, జ్ఞానాపురం, అక్కయ్యపాలెం, దాబాగార్డెన్స్, పెదవాల్తేర్, చినవాల్తేర్, పాతనగరం, కేజీహెచ్, రామకృష్ణా బీచ్ తదితర ప్రాంతాల్లో వీళ్లు ఎక్కువగా కనిపిస్తారు. చివరికి ఎక్కడో బతుకు పయనం ముగిస్తారు. అనాథ మృతదేహంగా ఇక్కడి మట్టిలో కలిసిపోతారు. బిచ్చగాళ్లలా యాచించడం కూడా తెలియక ఎవరైనా జాలిపడి ఏదైనా ఇస్తే తిని, లేదంటే అలా గాలికెగిరే ఎండుటాకులా ఊరంతా సంచరిస్తూ ఉంటారు. సమాజంలో ఉన్న అనేక అపోహలు, తప్పుడు అభిప్రాయాల కారణంగా వీరికి సాయం చేయడానికి కూడా ఎవరూ ముందుకు రారు. అసలు వీరి గురించి పట్టించుకోవడానికి కూడా ఎవరూ ఇష్టపడరు. నగరంలోని పలువురు దాతలు తరచూ ఫుట్‌పాత్‌లు, బస్టాపుల్లో గల పిచ్చివాళ్లకు భోజనాలు అందజేస్తూ తమ దాతృత్వం చాటుకుంటున్నారు. కాని, ఆస్పత్రికి తరలించే విషయంలో మాత్రం అంతటా నిర్లక్ష్యం కనిపిస్తోంది.

ఇక్కడికే ఎందుకు?

సాధారణంగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రజలు తమ ఇంట్లో ఎవరికైనా పిచ్చి పడితే విశాఖపట్నం వెళ్లే రైళ్లలో బలవంతంగా ఎక్కించేస్తుంటారన్న అపప్రథ ఉంది. విశాఖలో ప్రభుత్వ మానసిక ఆస్పత్రి ఉండడమే దీనికి కారణంగా చెప్పుకుంటారు. ప్రజలో, పోలీసులో వీరిని ఆస్పత్రిలో చేర్పిస్తారులే అన్న నిర్లక్ష్యం ఎక్కువగా కనిపిస్తుంది. ఎవరికైనా పిచ్చి పడితే వారిని వదిలించుకుందామని కుటుంబ సభ్యులే చూడటం అంతరించిపోతున్న మానవత్వానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు.

ఇలా చేస్తే మేలు..

నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపైనా, బస్టాపుల్లోనూ, ఫుట్‌పాత్‌లపైనా చాలా మంది నా అన్న వాళ్లకు దూరంగా బతుకుతున్నారు. అందరూ వీరిని చూసి అయ్యో అనుకోవడం తప్ప ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి. ఇటీవల అపోహల కారణంగా వీరి మీద జనం దాడులు చేస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మానసిక ఆస్పత్రి ఆధ్వర్యంలో ఒక సంచార వాహనం ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పిచ్చివాళ్లను ఆస్పత్రికి తరలించాలి. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం కూడా స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



స్టేషన్ రోడ్డులో ఇలా..



చెత్తకుప్ప పక్కన ఇలా...



దాతలు సాయం చేస్తేనే...

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: సింహగిరికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సింహాచలేశుడిని దర్శించుకోవడానికి బారులు తీరారు. దీంతో గిరిపై ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది. వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగల తో అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతి అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాన్ని విశేషంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

సండే సందడి



ముత్యాలమ్మపాలెం తీరంలో ఉత్సాహంగా గడుపుతున్న సందర్శకులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో సందడిగా మారాయి. పట్టణ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన సందర్శకులు తీర ప్రాంతాలకు చేరిపోయారు. తీర ప్రాంతాల్లోని ఇసుక తిన్నెలపై కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి ఆట పాటలతో సరదాగా గడిపారు. సాయంత్రం తీరంలో జలకాలాటలతో సందడి చేసి ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు.

దేవస్థానంలో ఉద్యోగం ఓ వరం

ఈవో శ్రీనివాసమూర్తి



రామానుజంను సన్మానిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు రాజగోపాల్ తదితరులు

సింహాచలం: దేవస్థానంలో ఉద్యోగం చేయడం భగవంతుడు ఇచ్చిన ఓ వరం లాంటిది.. అది కొందరికే లభిస్తుందని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అన్నారు. సింహాచలం దేవస్థానంలో నాలాయర అధ్యాపకుడిగా పనిచేసి ఆదివారం పదవీవిరమణ చేసిన నిడమర్తి కందాడై వరాహ కృష్ణ రామానుజంను సింహగిరిపై కల్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ దేవస్థానంలో ఉద్యోగం చేయడాన్ని పూర్వజన్మ సుకృతంగా భావించాలన్నారు. వైదిక వృత్తి ఎంతో గొప్పదన్నారు. రామానుజం 38 ఏళ్ల పాటు ఆదర్శంగా సేవలందించారని కొనియాడారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ మాట్లాడుతూ సింహాచలం దేవస్థానం దత్తత ఆలయమైన పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామి ఆయంలో నిత్య అధ్యాపక,రామాయణ పారాయణదారుగా ఉద్యోగం పొందిన రామానుజం 1992లో సింహాచలం దేవస్థానానికి వచ్చారన్నారు. 2021లో ఉపనిషత్ పారాయణదారునిగా, 2016లో నాలాయర అధ్యాపకునిగా పదోన్నతులు పొందారని చెప్పారు. రెండుసార్లు ఉత్తమ ఉద్యోగిగా కూడా రామానుజం అవార్డులు అందుకోవడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ, ఉద్యోగులు చక్రవర్తి, అర్చకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు ఘన సత్కారం



వీఆర్ఎస్ తీసుకున్న హెచ్ఎం సోమునాయుడును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సబ్బవరం: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య నభ్యసించి బావిభారత పౌరులుగా ఎదగాలని మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. సోమునాయుడు అన్నారు.మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేస్తున్న ఆయన వలంటరీ రిటైర్మెంట్ ప్రకటించారు.దీంతో ఆయన్ను తోటి ఉపాధ్యాయులు స్థానిక పాఠశాలలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సాంబమూర్తి మాట్లాడుతూ ఆయన శేష జీవితం అంతా ఆనందమయం కావాలని ఆకాంక్షించారు.

ఫార్మా వ్యర్థాలు అరికట్టాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న భర్నికం గ్రామ ప్రజలు

పరవాడ: చెరువులు, గెడ్డల్లోకి ఇష్టానుసారంగా ఫార్మా వ్యర్థాలు విడిచిపెట్టడం వల్ల నీరు కలుషితమవుతుందని భర్నికం గ్రామ ప్రజలు వాపోయారు. వ్యర్థజలాలు విడుదల చేస్తున్న ఫార్మా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో భర్నికం వాసులు మొల్లేటి గెడ్డ వద్ద ఆదివారం ఆందోళనకు దిగారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మొల్లేటి గెడ్డలోకి వ్యర్థ రసాయనాలు విడిచిపెట్టడడం వల్ల గెడ్డలోని నీరంతా కలుషితంగా మారి భరించలేని దుర్వాసన వెదజల్లుతుందన్నారు. పంటలు నాశనమవుతున్నాయ ని ఆరోపించారు.పీసీబీ అధికారులు స్పందించి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు పెదిశెట్టి సత్యారావు డిమాండ్ చేశారు. సముద్ర జలాల్లోకి పంపాల్సిన ఫార్మా వ్యర్థ రసాయనాలను గెడ్డలు, చెరువుల్లోకి వదలడంతో ప్రజారోగ్యం దెబ్బతింటుందని మాజీ సర్పంచ్ బొండా తాతారావు ఆరోపించారు. కార్యక్రమంలో బొండా వెంకట సత్యారావు, జి.అప్పలరాజు, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవమే ఐఎన్‌టీయూసీ లక్ష్యం



మంత్రి రాజశేఖర్‌ను అభినందిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పూర్వ వైభవమే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ ముందుకు సాగుతుందని, రాజకీయాలకు అతీతంగా ప్లాంట్ పరిరక్షణకు పోరాడుతామని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఇంటక్ హయాంలో ఉన్న కార్మిక ప్రయోజనాలను యాజమాన్యం, కమ్యూనిస్టు సంఘాలు మంగళం పాడేశాయన్నారు. నేడు ఉద్యోగుల జీతాల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తేనే ఇరు సంస్థలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. త్వరలో ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి సమస్యల పరిష్కారాన్ని కోరతామన్నారు. ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలతో ముందుకు సాగుతామన్నారు. ఈ సందర్భంగా ఆయన పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాటూరి శ్రీనివాస్, మురళీరాజు, కారు రమణ, పి.వి. రమణమూర్తి, బీఎస్ రాజు, అవతారం, ప్రభాకరరెడ్డి, సాహు, పి.వి. నగేష్, బి.టి. జగదీష్, మద్ది అప్పలరాజు, గంగవరం గోపి, గౌరీప్రసాద్, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు హనుమాన్‌నగర్‌లో కొలువుదీరిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్‌నగర్, సమ్మెంగపాలెం, జాలరిపేట, మంగప్పయ్యగారి ఊరు, కోరంగిపాలెం గ్రామాలకు చెందిన భక్తులు వేకువ జాము నుంచి ఆలయానికి తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, హోమం జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ప్రకాశరావు సేవలు అభినందనీయం



కర్రా ప్రకాశరావును సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకుడిగా కర్రా ప్రకాశరావు విలువైన సేవలు అందించారని సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు ఎస్. కనకరావు కొనియాడారు. ఉక్కునగరంలో జరిగిన స్టీల్‌ప్లాంట్ యుఎస్ఈయూ ఉప ప్రధానకార్యదర్శి కర్రా ప్రకాశరావు ఆత్మీయ వీడ్కోలు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రకాశరావు తన విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయడంతో పాటు కార్మిక నాయకుడిగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. స్టీల్‌ప్లాంట్ యూనియన్ అధ్యక్షుడు కె. సత్యం నాయుడు, డి. సురేష్‌బాబు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, జె. అయోధ్యరామ్, రామస్వామి, వై. మస్తానప్ప, కారు రమణ, యూనియన్ నాయకులు ఎల్.వి. రమణారావు, సి. మొఘలేశ్వరన్, ఆర్. రాజబాబు, డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయండి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ గణేష్

ఉక్కునగరం: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసినట్టు అవుతుందని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్ అన్నారు. చిన్నమిషన్ ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉక్కునగరం క్లబ్, విశాఖ బ్లడ్ సెంటర్ సహకారంతో ఉక్కునగరం క్లబ్ పార్టీ హాల్–3లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ ఎ.పి. నవీన్ కుమార్, చిన్మయ మిషన్ రెసిడెంట్ కమిషనర్ ఆచార్య స్వామి రఘువీరానందలతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన శిబిరంలో 50 యూనిట్లు రక్తం సేకరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రంజన్, చిన్మయ మిషన్ కార్యదర్శి జయంతి కుమార్, ఎన్.వి. స్వామి, ఎస్. కుమార్, బ్లడ్ సెంటర్ ప్రతినిధి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగానికి చేయూతనివ్వండి



ప్రేక్షకులను అలరిస్తున్న భక్త ప్రహ్లాద నాటకంలోని ఓ అద్భుత ఘట్టం

మద్దిలపాలెం: ప్రతి ఒక్కరూ పౌరాణిక నాటకాలకు చేయూతనివ్వాలని కళాభారతి అధ్యక్షుడు, ఎస్ఆర్‌కే ఇన్ఫ్రా ప్రాజెక్ట్ చైర్మన్ ఎం.ఎస్.ఎన్. రాజు పిలుపునిచ్చారు. శ్రీ భానోదయ నాట్య మండలి (సురభి, హైదరాబాద్) 140వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కళాభారతి పద్మశ్రీ సురభి బాబ్జి కళా ప్రాంగణంలో భక్త ప్రహ్లాద నాటకం ప్రదర్శించారు. రంగసాయి నాటక సంఘం ఆవిష్కర్త బాదంగీర్ సాయి, కళాభారతి యాజమాన్యం సహకారంతో రంగసాయి మీడియా ఏర్పాటు చేసిన రెండవ రోజు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రేపటి తరానికి మన సంస్కృతిని అందివ్వాలన్నారు. బాదంగీర్ సాయి అందిస్తున్న కళాదీప్తిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాదంగీర్ సాయి మాట్లాడుతూ కళా ప్రోత్సాహకులే రాజపోషకులుగా నాటక రంగం మనుగడ సాగించాలని ఆశించారు. ప్రత్యేక అతిథులుగా కళాభారతి కార్యదర్శి రాంబాబు, ట్రస్టీలు మల్లికా మనోజ్, రామ్‌గోపాల్, ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ అధికారులు నాగరాజారావు, ఎంవీ సుబ్రహ్మణ్యం, సినీ దర్శకులు ఆకిరి సురేష్, రంగస్థల నటులు వల్రే నాంచారయ్య, రిటైర్డ్ ఏడీజే డాక్టర్ పీజే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండో దఫా కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో రెండో దఫా కౌన్సెలింగ్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24లోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 25న నిర్వహించనున్న వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 27, 28 తేదీల్లో మొదటి దఫా కౌన్సెలింగ్‌లో మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశాల కోసం అభ్యర్థులు ఏ ఐటీఐలో సీటు కావాలో ఆ ఐటీఐకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఆర్ కార్డుదారులు దరఖాస్తులో ఎస్పీ అని నమోదు చేసుకోవాలని సూచించారు.